ఆత్మకూరు(ఎం) : పల్లెర్లలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదుగాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 26 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదుగాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టనుందని తెలిపారు. మండలంలోని పల్లెర్ల గ్రామంలో 52మంది, తుక్కాపురంలో 45మంది మహిళలకు కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్, తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో 90రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం మహిళలకు ప్రభుత్వ విప్ కుట్టు మిషన్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కె.నరేందర్‌గుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ తండా నర్సింహ, మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి, కుట్టు శిక్షణ కేంద్రం కన్వీనర్ మధు పాల్గొన్నారు.

చిన్న గౌరాయిపల్లిని అభివృద్ధి చేస్తాం

యాదగిరిగుట్ట : చిన్న గౌరాయిపల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని చిన్నగౌరాయిపల్లి గ్రామంలో సోమవారం మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సకల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమనపల్లి అనూరాధ, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

ఆలేరు రూరల్, ఆగస్టు 26 : గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండలంలోని కొలనుపాకలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ రాజాపేట, ఆలేరు మండలాల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గంధమల్ల చెరువును రిజర్వాయర్ చేస్తే ఆలేరు నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందుతుందన్నారు. భువనగిరి నుంచి గూడూరు వరకు బునాదిగాని కాల్వ నిర్మాణం చేపట్టాలని, గ్రామాల్లో ఇసుక మాఫియాను ఆరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా రైతాంగానికి ఒక్క పైసా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్, ఏఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలాదేవి, కొల్లూరి రాజయ్య, నాయకులు కనకయ్య, రవి, ప్రవీణ్, లింగం పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవిని భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఆలేరు ఎస్సీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆలేరు రూరల్, ఆగస్టు 26 : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవిని భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సంఘర్షణ సైకిల్‌యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి ఆలేరులోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో బస చేసి మాట్లాడారు. ఆలేరులోని ఎస్సీ బాలికల హాస్టల్ శిథిలావస్థకు చేరి విద్యార్థులు భయాందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాస్టల్‌ను సందర్శించి నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలన్నారు. ఎస్టీ హాస్టల్లో స్నానపు గదులు మరుగుదొడ్లకు డోర్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతపుడి శివ, లావుడియా రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కాసుల నరేశ్, నాగరాజు, నాగేందర్, విక్రమ్, ప్రణయ్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

సాయిబాబా దేవాలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 26 : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం 19వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కాగడ హారతి, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా మోటకొండూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన బాశెట్టి నాగమణి, సత్యనారాయణ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొడూరి మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, ప్రవీణ, మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, మాజీ సర్పంచులు నగేశ్, లక్ష్మారెడ్డి, పూర్ణచందర్‌రాజు, చందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కవిత, ఆలయ పూజారి చంద్రశేఖర్‌శర్మ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 26 : మండలంలోని బొడ్డుగూడెం గ్రామ స్టేజీ వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డి.రేపాక గ్రామానికి చెందిన గుండ తరుణ్ వ్యక్తిగత పనుల నిమిత్తం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో తొర్రూరు మండలం చీకటయపాలెం గ్రామానికి చెందిన మంగళపల్లి మల్సూర్, వేల్పుకొండ మహేందర్ ద్విచక్ర వాహనంపై పోచంపల్లికి వెళ్లి వస్తున్నారు. వీరి వాహనాలు బొడ్డుగూడెం స్టేజీ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి తమ పెట్రోలింగ్ వాహనంలో చాడ వరకు తీసుకెళ్లారు. అక్కడికి 108 అంబులెన్స్ రావడంతో అందులో ఎక్కించి భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

వ్యక్తి అదృశ్యం

శ్రీశైలం (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : పట్టణంలోని రాయగిరిలో ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగిరికి చెందిన కొత్త శ్రీశైలం ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీశైలం కుమారుడు మహేశ్ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరు కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఆగస్టు 26 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సోమవారం ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపట్టారు. శ్రావణ సోమవారంతోపాటు శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సెలవు కావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.36,47,852 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామివారిని దర్శించుకున్న వ్యవసాయ శాఖ కార్యదర్శి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సోమవారం యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన స్వయంభూ పంచనారసింహస్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదం అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

రఘునందన్‌రావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

నేడు జిల్లాకు జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు రాక

భువనగిరి కలెక్టరేట్/ బీబీనగర్, ఆగస్టు 26 : జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు బీబీనగర్ లోని ఎయిమ్స్ ఉద్యోగులతో, ఉదయం 11గంటలకు ఎయిమ్స్ మేనేజ్‌మెంట్‌తో సమావేశమవుతారని తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు బస్వాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టును సందర్శిస్తారని, సాయంత్రం 3గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమవుతారని తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

చౌటుప్పల్, ఆగస్టు 26 : మండలంలోని బంగారిగడ్డ గ్రామ శివారులో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఆరుగురుని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.41వేల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీరా కేంద్రం ప్రారంభించకుంటే నిరాహార దీక్ష

- సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు జైహింద్‌గౌడ్

నందనంలోని నీరా కేంద్రం వద్ద మాట్లాడుతున్న పంజాల జైహింద్ గౌడ్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 26 : గీత కార్మికుల సంక్షేమం, అభ్యున్నతి కోసం భువనగిరి మండలం నందనంలో ఏర్పాటు చేసిన నీరా కేంద్రాన్ని ప్రభుత్వం వచ్చే నెల 18లోపు ప్రారంభించకుంటే నిరాహార దీక్ష చేపడుతామని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు, సినీ హీరో పంజాల జైహింద్ గౌడ్ అన్నారు. నందనం నీరా కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 2021లో నీరా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పాలని సర్దార్ సర్వాయి పాపన్న సేన ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఎంతో పోరాటం చేశామన్నారు. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం రూ.7కోట్లు విడుదల చేయగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నీరా ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. పనులన్నీ పూర్తవ్వడంతోపాటు కేంద్రంలో అన్ని రకాల యంత్రాలు సమకూరాయని చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి 8 నెలలు గడుస్తున్నా నీరా ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, గౌడ కులస్తుల అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. నీరా కేంద్రాన్ని సెప్టెంబర్ 18లోపు ప్రారంభించాలని, లేనిపక్షంలో నీరా పారిశ్రామిక యూనిట్ వద్ద పెద్దఎత్తున నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న సేన రాష్ట్ర అధ్యక్షుడు పంజాల శ్రవణ్‌కుమార్ గౌడ్, నాయకులు పరశురామ్‌గౌడ్, కలర్ సత్తన్నగౌడ్, పరిటాల రవిగౌడ్, నాగెళ్లి సత్యనారాయణ గౌడ్, బాల రాజు గౌడ్, కిరణ్ గౌడ్, పంజాల లోకేశ్ గౌడ్ పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, ఆగస్టు 26 : కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని మొగిలిపాక గ్రామానికి చెందిన పన్నాల నర్సిరెడ్డికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఎల్ఓసీ మంజూరైంది. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం నర్సిరెడ్డి కుటుంబ సభ్యులకు ఆ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ నాయకులు మామిడి సత్తిరెడ్డి, ముద్దసాని జయసింహారెడ్డి, ఎల్లయ్య, వెంకన్న, రాంబాబు, సత్యం పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 26 : మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన మూడు లక్షల రూపాయల చెక్కులను నాయకులు తడక వెంకటేశ్, భారత లవకుమార్ సోమవారం బాధితులకు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని డి.పారిజాతకు రూ.12,500, ఎస్.నవీన్‌కు రూ.60 వేలు, కె.రవికి రూ.7వేలు, కె.సంధ్యకు రూ.8,500, ఎ.కావ్యకు రూ.50,500, ఎన్.భార్గవికి రూ.12వేలు, టి.రేణుకకు రూ.15వేలు, జయలక్ష్మికి రూ.18 వేలు, ఆర్.నవ్యకు రూ.39 వేలు, పద్మకు రూ.12వేలు, బీరమ్మకు రూ.48వేలు, ఎం.రమేశ్‌కు 15వేల రూపాయలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు భోగ భానుమతి, మోటై రజిత, నాయకులు సీత సుధాకర్, వెంకటేశం, గునిగంటి వెంకటేశం, కుమార్, శశికళ, సృజన, అంజయ్య, యాదగిరి, చంద్ర ప్రకాశ్, శశికళ, అంజమ్మ, నీలమ్మ, నర్సింహ, నవీన్, ధర్మేందర్, నరేశ్ పాల్గొన్నారు.

‘పల్లె ప్రగతి’ తో పచ్చదనం

రాజాపేట, ఆగస్టు 26 : బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. పరిశుభ్రత, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయి. రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో పల్లె ప్రగతి నిధులతో డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం వంటి అభివృద్ధి, పచ్చదనం పనులు చేపట్టారు. పల్లె ప్రకృతి వనంలో నాడు నాటిన మొక్కలు ఏపుగా పెరిగి గ్రామానికి పచ్చని అందాలను తెస్తుంది. వైకుంఠధామం, డంపింగ్ యార్డు అభివృద్ధికి నిదర్శనంగా నిలిచాయి.

రేణికుంటలోని పల్లె పకృతి వనం

రేణికుంటలోని వైకుంఠధామం

ఆరుట్ల రామచంద్రారెడ్డికి నివాళి

ఆరుట్ల రామచంద్రారెడ్డి స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలేరు రూరల్, ఆగస్టు 26 : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, మాజీ ఎమ్మెల్యే ఆరుట్ల రామచంద్రారెడ్డి 39వ వర్ధంతిని మండలంలోని కొలనుపాకలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలాదేవి వృద్ధులకు చేతికర్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు చెక్క వెంకటేశ్, కనకయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



బీబీనగర్ : మహదేవ్‌పూర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజాపేట : రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు

బీబీనగర్, ఆగస్టు 26 : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మహదేవ్‌పూర్ గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట స్వర్ణగిరికి చెందిన మానేపల్లి విజయలక్ష్మి, మానేపల్లి మురళీకృష్ణ, శ్రీలత స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కృష్ణాష్టమి సందర్భంగా విశేష ద్రవ్య అభిషేకం, నీరాజనం, మంత్రపుష్పములు సమర్పించారు. పల్లకీ సేవలు, విశేష పూజా కార్యక్రమాలను దేవాలయ అర్చకులు శ్రీమన్నారాయణాచార్యులు, జైశ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు భజన సంగీత నృత్య కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రుద్ర వెంకటేశం, దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ దండెం ప్రభాకర్, వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని మార్కండేశ్వర, లక్ష్మీనారాయణస్వామి దేవాలయాల వద్ద, లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వచ్చి కోలాటాలు, నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్లు సీత సత్యనారాయణ, అంకం వినోద్ పాల్గొన్నారు.

ఆలేరు రూరల్ : కృష్ణాష్టమి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. గ్రామాల్లో సాయంత్రం ఉట్లు కొట్టారు.

మోత్కూరు : మున్సిపాలిటీతోపాటు దత్తప్పగూడెం, పాలడుగు, దాచారం, పొడిచేడు, పాటిమట్ల తదితర గ్రామాల్లో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యాదవ సొసైటీ చైర్మన్ పురుగుల మల్లయ్య, మాజీ ఎంపీటీసీ జంగ శ్రీను, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో భక్తులు ఆలయాల్లో పూజలు చేసి ఉట్లు కొట్టారు. చిన్నారులు గోపికలు, చిన్ని కృష్ణుడి వేషధారణలో మురిసిపోయారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలో యువకులు ఉత్సాహంతో పాల్గొన్నారు.

అనంతరం దేవతా విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఆలయాల్లో పూజలు చేశారు.

రాజాపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణ, గోపికల వేషధారణలతో అలరించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

రామన్నపేట : బాలకృష్ణుడు, గోపికల వేషధారణలో కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు

మోత్కూరులో శ్రీకృష్ణాష్టమి పూజల్లో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ రూరల్ : మున్సిపాలిటీలోని మార్కండేయ ఆలయం ఆవరణలో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్న దేవాలయ కమిటీ

‘బిక్కేరు వాగు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వద్దు’

గుండాల, ఆగస్టు 26 : మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో బిక్కేరు వాగు నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలింపునకు ప్రయత్నిస్తున్నారని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోలుకొండ యాదగిరి అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన కొందరు నాయకులు ఇసుక రవాణా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇసుక తవ్వకం వల్ల భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గుండాల మండలంలో వర్షాలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, వరి పంటలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. గుండాల మండలంలో ఇప్పటికే కరువు పరిస్థితులు దాపురించాయన్నారు. ఇసుక రవాణా పేరుతో కొంతమంది నాయకులు ఎమ్మెల్యేను బద్నాం చేయాలని చూస్తున్నారని, ఎమ్మెల్యే సైతం ఇసుక రవాణాను వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని ఆయన కోరారు.

రుణమాఫీ కోసం 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 26 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షల వరకు ఉన్న రూ.42వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేసి రైతులను మోసం చేశారన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీజన్ ముగుస్తున్నా ఇప్పటి వరకు రైతుభరోసా కింద నిధులను విడుదల చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీరున్నందున చెరువులు, కుంటలను నింపి చివరి భూములకు నీరందించాలని కోరారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, పాపానాయక్, దయానంద్, ఎల్లయ్య, రామారావు, చాంద్‌పాషా, బాషా పాల్గొన్నారు.